అర్బన్ హెల్త్ సెంటర్‌కు నీళ్లు బంద్

- ఏడాదిగా అద్దె చెల్లించని అధికారులు
- నీటి సరఫరా నిలిపివేసిన యజమాని
- నిధులు మంజూరైనా ప్రారంభం కాని సొంత భవనం పనులు
- దయనీయంగా జవహర్‌నగర్ యూపీహెచ్‌సీ పరిస్థితి

బంజారాహిల్స్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): చిన్నపాటి ఆరోగ్య సమస్య వచ్చినా నిరుపేదలు అర్బన్ హెల్త్ సెంటర్‌లకు పరుగులు తీస్తుంటారు. ఇక్కడ వైద్యులు అందుబాటులో ఉండడంతో పాటు ఆరోగ్య పరీక్షలు ఉచితంగా చేసేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేయడంతో వారిపై ఆర్థిక భారం తగ్గుతుంది. అయితే ఈ అర్బన్ హెల్త్ సెంటర్ల నిర్వాహణ విషయంలో వైద్య శాఖ అధికారులు నిర్లక్ష్యంతో వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. బంజారాహిల్స్ రోడ్ నంబర్ 2 జవహర్‌నగర్ కాలనీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (యూపీహెచ్‌సీ)లో ప్రస్తుతం నెలకొన్న సమస్యలే దీనికి నిదర్శనం. కాలనీలో 15 సంవత్సరాల క్రితం అర్బన్ హెల్త్ సెంటర్ ప్రారంభమైంది. అయితే కొన్ని కారణాలతో కొద్దికాలం పాటు దీన్ని మూసివేశారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం ఈ దవాఖానా కోసం కాలనీలోని ఓ భవనంలో కొన్ని అంతస్తులను ప్రభుత్వం అద్దెకు తీసుకుంది. ఇందులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, వైద్యుడితో పాటు సిబ్బంది, మందుల షాపు నిర్వహణ కోసం నాలుగు గదులను తీసుకున్నారు. ప్రస్తుతం భవన యజమానికి అద్దె చెల్లించకపోవడం యూపీహెచ్‌సీ నిర్వహణకు సమస్యగా మారింది. దీంతో పేదలకు వైద్య సేవలు దూరమయ్యే పరిస్థితి నెలకొంది.

నీటి సరఫరా నిలిపివేత

కాలనీలో భవనాన్ని అద్దెకు తీసుకున్న వైద్యశాఖ ప్రతినెలా కిరాయి చెల్లిస్తూ వచ్చింది. అయితే ఏడాదిగా అద్దె చెల్లించకపోవడంతో భవన యజమాని పలుమార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాడు. బకాయిలు రాబట్టుకునేందుకు నీటి కనెక్షన్ కట్ చేసి సరఫరా నిలిపివేశాడు. ఇది రోగులకు సమస్యగా మారింది. అసలే వేసవి కావడంతో నీరు లేకపోవడంతో రోగులు, సిబ్బంది అవస్థలు పడుతున్నారు. నీటిని కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. అత్యవసరమైతే రోగులను శ్రీరామ్‌నగర్ ఆరోగ్య కేంద్రానికి పంపిస్తున్నారు. పరిస్థితి ఇలాగే ఉంటే భవిష్యత్తులో వైద్య సేవలు దూరమయ్యే ప్రమాదం ఉందని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అందుబాటులో ఉండని వైద్యుడు

మరోవైపు రోడ్ నంబర్ 2లోని షౌకత్ నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 8 నెలలుగా వైద్యులు అందుబాటులో లేరు. దీంతో జవహర్ నగర్ ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న డాక్టర్‌కు షౌకత్ నగర్ ఆరోగ్య కేంద్రం బాధ్యతలను అప్పగించారు. దీంతో ఆయన మూడు రోజులు జవహర్‌నగర్ కాలనీలో, మరో మూడు రోజులు షౌకత్ నగర్‌లో అందుబాటులో ఉంటున్నారు. ఈ విషయం తెలియక జవహర్‌నగర్ ఆస్పత్రికి వస్తున్న రోగులు డాక్టర్ అందుబాటులో లేకపోవడంతో ఉసూరుమంటూ వెనుదిరుగుతున్నారు. వైద్య శాఖ అధికారులు వెంటనే స్పందించి జవహర్ నగర్ ఆరోగ్య కేంద్రంలో నెలకొన్న సమస్యలపై దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు

సొంత భవన నిర్మాణంపై నిర్లక్ష్యం

జవహర్‌నగర్ కాలనీలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేసేందుకు సొంత భవనం కావాలని గతంలో స్థానికులు అనేక విజ్ఞప్తులు చేశారు. రెండేళ్ల క్రితం వైద్యశాఖ ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేసేందుకు స్థలాన్ని చూపించాలని షేక్‌పేట రెవెన్యూ అధికారులను కోరారు. ఈ మేరకు సర్వే నిర్వహించిన రెవెన్యూ అధికారులు బంజారాహిల్స్ రోడ్ నంబర్ 2 సాగర్ సొసైటీలోని 200 గజాల స్థలాన్ని కేటాయించారు. ఇందుకు సంబంధించి బదిలీ ప్రక్రియను ఆరు నెలల క్రితం పూర్తి చేశారు. వైద్య శాఖ ఇంజనీరింగ్ విభాగం అధికారులు జి ప్లస్ టు కింద భవనం నిర్మించేందుకు రూ.1.40 కోట్ల నిధులతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. నిధులు సైతం మంజూరయ్యాయి. అయితే వైద్యశాఖ అధికారులు టెండర్లు పిలవడంలో నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తున్నారు. దీంతో సొంత భవనం నిర్మాణంలో ఆలస్యం జరుగుతోంది. సొంత భవనం నిర్మించని అధికారులు.. ప్రస్తుతం ఉన్న భవనానికి అద్దె చెల్లించకపోవడంతో ఆరోగ్య కేంద్రం నిర్వహణ ప్రశ్నార్థకంగా మారింది.



జవహర్‌నగర్ కాలనీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

ఫుట్‌పాత్ ఆక్రమణలతో ఇబ్బందులు

- ఏసీపీకి ఫిర్యాదు చేసిన ఫిలింనగర్ హౌసింగ్ సొసైటీ కార్యదర్శి

బంజారాహిల్స్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ఫిలింనగర్‌లో ఫుట్‌పాత్ ఆక్రమణల కారణంగా ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నాయని బుధవారం ఫిలింనగర్ హౌసింగ్ సొసైటీ కార్యదర్శి కాజా సూర్యనారాయణ, కార్యవర్గ సభ్యులు పశ్చిమ మండలం ట్రాఫిక్ ఏసీపీ కట్టా హరిప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కాజా సూర్యనారాయణ మాట్లాడుతూ.. ఫిలింనగర్ చుట్టూ ఉన్న రోడ్లు, ఫుట్‌పాత్‌లను కొందరు ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తున్నారని, ఆ దుకాణాలకు వచ్చేవారు వాహనాలను రోడ్లపై నిలుపుతుండటంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. బస్తీలకు చెందిన నాయకులు ఫుట్‌పాత్ వ్యాపారుల వద్ద అద్దె వసూలు చేస్తున్నారని ఆరోపించారు. వెంటనే షాపులను తొలగించాలని ఆయన ఏసీపీని కోరారు. సానుకూలంగా స్పందించిన ఏసీపీ ఆపరేషన్ రోప్‌లో భాగంగా ఫుట్‌పాత్ వ్యాపారాలను తొలగిస్తున్నామని, ఫిలింనగర్‌లోనూ త్వరలో ప్రత్యేక డ్రైవ్ చేపడతామని చెప్పారు.

టాలెంట్ టెస్ట్‌లో శ్రీనిధి విశ్వభారతి విద్యార్థుల ప్రతిభ


ఉదయ్ కార్తీక్

పంజాగుట్ట, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మధురానగర్‌లోని శ్రీనిధి విశ్వభారతి ఉన్నత పాఠశాల, స్వీట్ ఏంజిల్ పాఠశాలలో బుధవారం 17వ ఆల్ ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మ్యాథ్స్, సైన్స్(ఏయిమ్స్) టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఇందులో శ్రీనిధి విశ్వభారతి, స్వీట్ ఏంజిల్ పాఠశాలల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. తొమ్మిదో తరగతి చదువుతున్న బి.ఉదయ్ కార్తీక్ జాతీయ స్థాయిలో 7వ ర్యాంక్, 3వ తరగతి విద్యార్థి డి.చతుర్ జాతీయ స్థాయిలో 8వ ర్యాంక్, 4వ తరగతి చదువుతున్న కె.మోక్షిత 9వ ర్యాంక్ సాధించారు. ఈ సందర్భంగా వారిని సంస్థ చైర్మన్ కొల్లి లక్ష్మణరావు, ప్రిన్సిపాల్ గీత, వైస్ ప్రిన్సిపాల్స్ విమల, రాజేశ్వరి తదితరులు విద్యార్థులను, గణితం, సైన్స్ ఉపాధ్యాయులు భవాని, యాదగిరిలను అభినందించారు.


చింతామణి నాటకంలో కళాకారుల అభినయం

కొనసాగుతున్న ఉగాది నాటకోత్సవాలు

బంజారాహిల్స్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ఉగాది నాటకోత్సవాల్లో భాగంగా ఫిలించాంబర్ రామానాయుడు కళామండపంలో నాటకోత్సవాలు కొనసాగుతున్నాయి. పొత్తూరి వెంకట సుబ్బారావు ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ ఉత్సవాల్లో భాగంగా బుధవారరం ఖమ్మంకు చెందిన సుమిత్రా యూత్ అసోసియేషన్ కళాకారులు నిర్వహించిన భక్త చింతామణి నాటకం ఆకట్టుకుంది. ఇందులో బిళ్వగా కె.శ్రీనివాసరావు, రాధగా లహరి, చింతామణిగా నెల్లూరి భానుమతి, భవానీగా కె.రామ్‌కుమార్, చిత్రగా గుడివాడ కుమారి, సుబ్బిశెట్టిగా ఎస్.రోశిరెడ్డి, శ్రీహరిగా నిభానుపూడి సుబ్బరాజు, దామోదరగా సూర్యప్రకాశ్‌రావు నటించారు. వీరికి హార్మోనియంతో నాగేశ్వర్‌రావు, డోలక్‌పై రామకృష్ణ సహకారం అందించారు.

ప్రశాంతంగా ముగిసిన పదవ తరగతి పరీక్షలు

పంజాగుట్ట, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): గత నెల 21న ప్రారంభమైన పదవ తరగతి వార్షిక పరీక్షలు బుధవారంతో ముగిశాయి. ఖైరతాబాద్, షేక్‌పేట మండలం పరిధిలో 17 ప్రభుత్వ పాఠశాల్లో 1,295 మంది, రెండు ఎయిడెడ్ పాఠశాలలో 37 మంది, 11 ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలల్లో 6,71 మంది, 103 ప్రైవేట్ పాఠశాలల్లో 6,130 మంది చొప్పున మొత్తం 8,133 విద్యార్థులు పరీక్షలకు సన్నద్ధం కాగా కొంతమంది విద్యార్థులు తప్ప మిగతా వారంతా పరీక్షలు రాశారు. పరీక్షలు బాగా రాయడంతో వారు ఉత్సాహంలో మునిగిపోయారు.

అధిక లాభాల పేరుతో రూ.1.67 లక్షలు కాజేశారు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): పెట్టుబడి పెట్టి పనిచేస్తే తక్కువ సమయంలోనే ఎక్కువ లాభాలు వస్తాయని నమ్మించిన సైబర్ నేరగాళ్లు నగరానికి చెందిన యువకుడి నుంచి రూ.1.67 లక్షలు కాజేశాడు. ఓ ప్రైవేట్ ఉద్యోగిని వాట్సాప్ ద్వారా సంప్రదించిన సైబర్ నేరగాళ్లు "కె తమిళ్ సెల్వి 11" టెలిగ్రాం గ్రూపులో చేర్చారు. మీషో సంస్థలో పెట్టుబడి పెట్టి ఆర్డర్లు బుక్ చేస్తే ఎక్కువ లాభాలు వస్తాయని.. దానికోసం కొన్ని టాస్క్‌లు పూర్తి చేయాలని సూచించారు. వారు చెప్పిన విధంగా పలు ఖాతాలకు డబ్బు బదిలీ చేస్తూ యువకుడు టాస్క్‌లు పూర్తి చేశాడు. పెట్టుబడితో పాటు లాభాలు ఆన్‌లైన్‌లో చూసి విత్‌డ్రా చేసే ప్రయత్నం చేశాడు. అయితే తమ సంస్థకు సంబంధించి మీ క్రెడిట్ స్కోర్ 100 మాత్రమే ఉందని, డబ్బు తీసుకోవాలంటే మరింత పెట్టుబడి పెట్టి క్రెడిట్ స్కోర్ పెంచుకోవాలని సూచించారు. దీంతో మోసపోయానని గ్రహించిన బాధితుడు సైబర్ క్రైం ఠాణాలో ఫిర్యాదు చేశాడు.

బాలిక పట్ల అసభ్యకర ప్రవర్తన.. యువకుడిపై కేసు

బంజారాహిల్స్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించిన యువకుడిపై పోక్సో కేసు నమోదైంది. ఫిలింనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో నివసించే బాలిక (11) స్థానిక పాఠశాలలో ఏడవ తరగతి చదువుతోంది. అదే బస్తీకి చెందిన చీర్ల నాగవేంద్ర రెండు రోజుల క్రితం బాలిక ఒంటరిగా ఉండటం చూసి అసభ్యంగా ప్రవర్తించాడు. బాధితురాలు విషయాన్ని తల్లికి చెప్పగా ఆమె ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి నాగవేంద్రను అదుపులోకి తీసుకున్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

మోతినగర్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మాదాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. సైబర్ టవర్స్ ఎదురుగా ఫ్లై ఓవర్ కింద గార్డెనింగ్ ప్రాంతంలో పురుషుడి మృతదేహం పడి ఉండడాన్ని స్థానికులు గుర్తించారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అతడు రెండు రోజుల క్రితం మృతిచెంది ఉంటాడని, మృతుడి శరీరంపై ఉన్న దుస్తుల ఆధారంగా యాచకుడై ఉంటాడని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

'మంత్రివర్గంలో మాదిగలకు స్థానం కల్పించాలి'

ఖైరతాబాద్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రివర్గంలో మాదిగలకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 5న ఇందిరాపార్కు వద్ద దీక్ష చేపడుతున్నట్లు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కోఆర్డినేటర్ అల్లారం రత్నయ్య మాదిగ వెల్లడించారు. బుధవారం సోమాజిగుడ ప్రెస్ క్లబ్‌లో పలు జిల్లాల అధ్యక్షులతో కలిసి రత్నయ్య మట్లాడారు. మాదిగ ఉపకులానికి మంత్రి పదవి ఉన్నా, 33 లక్షల జనాబా ఉన్న మాదిగలకు మంత్రివర్గంలో స్థానం లేకపోవడం బాధాకరమన్నారు. ఆరుగురు ఎమ్మెల్యేలున్న మాదిగల్లో ఒకరికైనా మంత్రిగా అవకాశం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో లింగాల పెద్దయ్య, స్వామిదాస్, బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక


రాజ్‌భవన్‌లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను మర్యాదపూర్వకంగా కలిసి సత్కరిస్తున్న రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ పూర్వ చైర్మన్ కోలేటి దామోదర్

- హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి)

కాంగ్రెస్ ప్రభుత్వానికి గుణపాఠం చెబుతాం

- మున్నూరుకాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దేవయ్య


సమావేశంలో అభివాదం చేస్తున్న మున్నూరుకాపు సంఘాల నాయకులు

ఖైరతాబాద్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మున్నూరుకాపులను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పే సమయం ఆసన్నమైందని తెలంగాణ మున్నూరుకాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కొండా దేవయ్య పటేల్ అన్నారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ఏర్పాటు కాకముందు మున్నూరుకాపుల జనాభా 40లక్షల వరకు ఉందని, గడిచిన పది సంవత్సరాల్లో మరో పది లక్షల పైగా పెరిగిందన్నారు. రాష్ట్రంలో ఉన్న 4.20 కోట్ల జనాభాలో కాపు, మున్నూరుకాపుల జనాభా 60 లక్షల వరకు ఉందన్నారు. రాష్ట్రంలో మున్నూరుకాపుల సంఖ్య అత్యధికంగా ఉన్నట్లు మంత్రి శ్రీధర్‌బాబు అసెంబ్లీలో చెప్పారన్నారు. ఎన్నికలకు ముందు అడ్డగోలు హామీలు ఇచ్చి మున్నూరుకాపుల ఓట్లతో అధికారంలోకి వచ్చిన కాగ్రెస్ నేతలు తమ సామాజికవర్గాన్ని పూర్తిగా విస్మరించారని ఆయన మండిపడ్డారు. ఈ నెల 13న జలవిహార్‌లో మున్నూరుకాపు గర్జన సన్నాహక సమావేశం నిర్వహిస్తున్నామని, అన్ని పార్టీలకు చెందిన నేతలు హాజరవుతారని ఆయన పేర్కొన్నారు. మే నెలలో సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో పది లక్షల మందితో మున్నూరుకాపుల గర్జన నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో కొత్త లక్ష్మణ్ పటేల్, చందు జనార్దన్ పటేల్, పురుషోత్తం పటేల్, ప్రముఖ మెజీషియన్ సామల వేణు తదితరులు పాల్గొన్నారు.


అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న నీలిమ

కమ్యూనిటీ హాళ్ల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

- కోట నీలిమ

బేగంపేట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): బస్తీలలో కమ్యూనిటీ హాళ్ల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని సనత్‌నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి డా. కోట నీలిమ అన్నారు. బుధవారం అమీర్‌పేట డివిజన్‌లోని బీజేఆర్‌నగర్-1 కమ్యూనిటీహాల్ మరమ్మతులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రూ.12.50 లక్షలతో కమ్యూనిటీహాల్‌ను అభివృద్ధి చేస్తున్నామన్నారు. అనంతరం అమీర్‌పేటలో కాంగ్రెస్ నాయకులు నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు.

నైట్ షెల్టర్‌లో సమస్యలపై అధికారుల స్పందన

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

బేగంపేట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): బేగంపేట సర్కిల్‌లోని నైట్ షెల్టర్ల సమస్యలపై 'నిరాశ్రయులకు నిత్యం వేధింపులే' పేరుతో మార్చి 12న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. బేగంపేట బస్తీ ఫ్లైఓవర్ కింద ఉన్న నైట్ షెల్టర్ నిర్వహణను పర్యవేక్షించే ఆమన్ వేదిక స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు ఇక్కడి సిబ్బందితో సమావేశం నిర్వహించి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఇక్కడ ఆశ్రయం పొందుతున్న 25 మందితో విడివిడిగా మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నిరాశ్రయుల పట్ల వేధింపులకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు తెలిపారు. మరోవైపు నైట్ షెల్టర్‌లో సమస్యలపై బేగంపేట సర్కిల్ జీహెచ్‌ఎంసీ అధికారులు సైతం దృష్టి సారించారు. కొన్ని నెలలుగా ఉన్న మరుగుదొడ్ల సమస్యను రెండు రోజుల్లోనప పరిష్కరించినట్లు యూసీడీ అధికారి దయాకర్ తెలిపారు.


బేగంపేట నైట్ షెల్టర్ వద్ద సీవరేజీ పనులు చేస్తున్న సిబ్బంది

ఇఫ్తార్ నిధులపై వివాదం

- కార్పొరేటర్ బాబా నిధులు అడ్డుకున్నారని ఇబ్రహీం గుల్షనీ ట్రస్ట్ ప్రతినిధుల ఆరోపణ
- వివాదాలకు కారణం ఎమ్మెల్యే మాగంటి అంటున్న బాబా సోదరుడు

బోరబండ, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): రంజాన్ పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఇఫ్తార్ విందు కోసం మంజూరైన నిధులు రాకుండా కొంతమంది అడ్డుకున్నారని జామా మసీద్ ఇబ్రహీం గుల్షనీ ట్రస్ట్ ప్రతినిధులు ఆరోపించారు. బోరబండ సైట్-3 కాలనీలోని ఇబ్రహీం గుల్షనీ మసీదులో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. మసీదుకు మంజూరైన నిధులు రాకుండా దొంగలేఖతో పాత కమిటీ ప్రతినిధులు అడ్డుకున్నారని, దీని వెనుక బోరబండ కార్పొరేటర్ బాబాఫసియుద్దీన్ ఉన్నారని విమర్శించారు. పీజేఆర్ ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు నిర్మించిన మసీదులో పలువురు ప్రజాప్రతినిధులు సౌకర్యాలు కల్పించారని, గడిచిన పదేళ్లలో ఫసియుద్దీన్ మసీదులో ఒక్క పనికూడా చేయించలేదన్నారు. ఈ సమావేశంలో ట్రస్ట్ చైర్మన్ సయ్యద్ మక్సూద్, అధ్యక్షుడు కేఎస్ మహబూబ్ బాషా, ఉపాధ్యక్షుడు ఎండీ హాజీ, కార్యదర్శి సయ్యద్ యూసుఫ్ పాల్గొన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న ట్రస్ట్ ప్రతినిధులు

ట్రస్ట్ చైర్మన్ నేనే

సైట్-3 కాలనీ జామా మసీద్ ఇబ్రహీం గుల్షనీ ట్రస్ట్‌కు తానే అసలైన చైర్మన్ అని మహమ్మద్ ఇస్హాక్ గుల్షనీ పేర్కొన్నారు. మసీదు ట్రస్ట్ పేరిట బోగస్ కమిటీ నిర్వహిస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బోరబండ పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎస్‌ఆర్‌ఆర్ పురం గృహనిర్మాణ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడైన తన తండ్రి మహమ్మద్ ఇసాక్ గుల్షనీ తనతాత ఇబ్రహీం గుల్షనీ పేరిట మసీదు నిర్మించారని వెల్లడించారు. మసీదు ట్రస్ట్ చైర్మన్‌గా కొనసాగిన ఇసాక్ గుల్షనీ 2017లో తనను ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా నియమించారని చెప్పారు. బోగస్ కమిటీ మీద కోర్టులో కేసు వేశామని, కోర్టులో కేసు ఉన్న కారణంగానే ఇఫ్తార్ నిధులు ఆపాలని తాము లేఖ రాసినట్లు తెలిపారు. తన సోదరుడు, స్థానిక కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్‌తో ఉన్న విభేదాల కారణంగా జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ఇదంతా చేస్తున్నారని ఆయన ఆరోపించారు.



నిరసనకారులు వస్తారన్న సమాచారంతో బారికేడ్లు ఏర్పాటు చేస్తున్న పోలీసులు

అంబేడ్కర్ విగ్రహం వద్ద భారీ బందోబస్తు

ఖైరతాబాద్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): హెచ్‌సీయూ భూముల విషయమై విద్యార్థుల ఆందోళనల్లో భాగంగా విద్యార్థులు, ప్రజా సంఘాల నాయకులు ఎన్టీఆర్ మార్గ్‌లోని 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసనకు వస్తున్నారనే సమాచారంతో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. సెంట్రల్ జోన్ అధికారులతో పాటు సైఫాబాద్ డివిజన్ ఏసీపీ సంజయ్‌కుమార్ నేతృత్వంలో బందోబస్తు నిర్వహించారు. అయితే నిరసనకారులు ఎవరూ ఇక్కడకు రాకపోవడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.

శునకాల బారి నుంచి రక్షణ కల్పించాలి

బంజారాహిల్స్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): పెంపుడు శునకాలు దాడి చేసి తీవ్రంగా గాయపరుస్తున్నాయని, వాటి బారి నుంచి రక్షణ కల్పించాలని కోరుతూ షేక్‌పేట ఆదిత్య టవర్స్ నివాసితులు ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమ అపార్ట్‌మెంట్‌లో ఉంటున్న ఓ కుటుంబం సెల్లార్‌లోని పార్కింగ్ ప్రాంతంలో కుక్కలను పెంచుకుంటున్నారని, వాటిని బహిరంగంగా వదిలేయడం వల్ల దాడులు చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. గత నెల 30న 8 ఏళ్ల బాబుపై శునకాలు దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడని తెలిపారు. శునకాల విషయంలో గతంలో కోర్టుకు వెళ్లగా న్యాయమూర్తి కొన్ని నిబంధనలు విధించారని, అయితే కుక్కల యజమానులు వాటిని ఉల్లంఘిస్తూ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారన్నారు. వారిపై క్రిమినల్ కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని వారు కోరారు.


పార్కింగ్ ఏరియాలో తిరుగుతున్న పెంపుడు శునకాలు


పోటీలను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ వనం సంగీతాశ్రీనివాస్‌యాదవ్

కుస్తీ పోటీలు ప్రారంభం

బంజారాహిల్స్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ డిస్ట్రిక్ట్ అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎల్లారెడ్డిగూడ పీజేఆర్ కమ్యూనిటీ హాల్‌లో బుధవారం అండర్ 15, 17, 20 కుస్తీ పోటీలు ప్రారంభమయ్యాయి. దయానంద్ యాదవ్ స్మారకార్థం ఏర్పాటు చేసిన ఈ పోటీలను సోమాజిగూడ కార్పొరేటర్ వనం సంగీతాశ్రీనివాస్‌యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కుస్తీ పోటీలకు ఎల్లారెడ్డిగూడ వేదిక కావడం ఆనందంగా ఉందన్నారు. ఈ పోటీల్లో రాణించే వారికి మంచి ప్రోత్సాహకాలు అందచేయనున్నట్టు తెలిపారు. పోటీలు ఈ నెల 5 వరకు కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెజ్లింగ్ అసోసియేషన్ రాష్ట్ర నాయకుడు గొంటి శ్రీనివాస్‌యాదవ్, కిరణ్‌యాదవ్, మనోజ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వసంత నవరాత్రి ఉత్సవాలు

బేగంపేట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): బేగంపేటలోని ప్రకాశ్‌నగర్ రామలింగేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న కోదండ రామాలయంలో వసంత నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. మార్చి 30న ప్రారంభమైన వేడుకలు ఈ నెల 6న జరగనున్న సీతారాముల కల్యాణ మహోత్సవంతో ముగుస్తాయని ఆలయ ఈవో విఠలయ్య తెలిపారు. వసంత నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ప్రతి రోజూ ఉదయం 9 గంటల నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు ఉంటాయన్నారు. సాయంత్రం 6 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామ, నామరామాయణ పారాయణ కార్యక్రమాలు ఉంటాయన్నారు. 6న ఉదయం 11.52 నిముషాలకు సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించన్నుట్లు తెలిపారు.


ఉత్సవాల సందర్భంగా ముస్తాబైన సీతారాములు

ఎర్రగడ్డలో..

ఎర్రగడ్డ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఎర్రగడ్డలోని విజయలక్ష్మీ దేవాలయంలో శ్రీరామ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. గత నెల 30న ప్రారంభమైన ఉత్సవాలు ఈ నెల 6వ తేదీ శ్రీరామనవమితో ముగుస్తాయి. ఉత్సవాల్లో భాగంగా తొమ్మిది రోజులపాటు రామాయణంలోని ఒక్కొక్క కాండను వివరిస్తారు. ఈ మేరకు బుధవారం అరణ్యకాండ గురించి అర్చకులు వివరించారు.

డిప్యూటీ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన సమ్మయ్య


సమ్మయ్య

ఖైరతాబాద్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): జీహెచ్‌ఎంసీ సర్కిల్ 18 ఉపకమిషనర్‌గా వి.సమ్మయ్య బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఈ స్థానంలో ఉన్న వి.ప్రశాంతి శేరిలింగంపల్లి జోన్‌కు బదిలీ కాగా బేగంపేట సర్కిల్ ఉప కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న సమ్మయ్యను జూబ్లీహిల్స్ ఉపకమిషనర్‌గా నియమించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం సమ్మయ్య మాట్లాడుతూ.. ఎర్లీ బర్డ్ పథకంలో భాగంగా 5శాతం ప్రత్యేక రిబేటుతో కొత్త సంవత్సరం ఆస్తిపన్ను కట్టే అవకాశం ఉన్నదన్నారు. ఉన్నతాధికారులు, సిబ్బంది సహకారంతో సర్కిల్‌లో అభివృద్ధి పనులు జరిగేలా చూస్తానన్నారు.



చెక్కును అందజేస్తున్న సొసైటీ అధ్యక్షుడు చిలుకు స్వామి, డైరెక్టర్లు

మృతుడి కుటుంబానికి ఆర్థిక చేయూత

రెజిమెంటల్‌బజార్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయీస్ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీలో సభ్యుడిగా ఉండి మృతి చెందిన వ్యక్తి కుటుంబానికి సొసైటీ ఆర్థిక చేయూత అందించింది. సొసైటీలో షేర్ హోల్డర్‌గా ఉన్న విజయ్ కుమార్ మృతి చెందడంతో అతను తీసుకున్న జనరల్, స్పెషల్, ఎడ్యుకేషన్ లోన్ మొత్తం రూ.7 లక్షలను మాఫీ చేశారు. అలాగే, రూ.2 లక్షల 24 వేల చెక్కును బుధవారం సికింద్రాబాద్ సొసైటీ కార్యాలయంలో విజయ్‌కుమార్ భార్య మణెమ్మకు సొసైటీ అధ్యక్షుడు చిలుకు స్వామి, డైరెక్టర్ అంజయ్య అందించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు మహేష్, రమేష్, సీసీఎస్ సెక్రటరీ రవి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

బేగంపేట సర్కిల్ ఉపకమిషనర్ సమ్మయ్య బదిలీ



సికింద్రాబాద్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ బేగంపేట సర్కిల్ ఉపకమిషనర్ సమ్మయ్య బుధవారం జూబ్లీహిల్స్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో డాకూ నాయక్ బేగంపేట సర్కిల్ ఇన్‌ఛార్జి కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం డాకూ నాయక్ జీహెచ్ఎంసీ సికింద్రాబాద్ జోన్ జాయింట్ కమిషనర్‌గా ఉన్నారు.



మందకృష్ణ మాదిగను కలిసిన ఎంఎస్‌పీ నాయకులు సీతారాం మాదిగ, ప్రకాశ్

మాదిగలకు అన్యాయం చేసిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం

● నందారం సీతారాం మాదిగ

బౌద్ధనగర్, ఏప్రిల్2(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ పేరుతో మాదిగలను మభ్యపెట్టి తీవ్రమైన అన్యాయం చేసిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి మాదిగలు తగిన గుణపాఠం చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయని మాదిగ సోషలిస్ట్ పార్టీ సీనియర్ నాయకుడు, బీదలబస్తీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు నందారం సీతారాంమాదిగ అన్నారు. బుధవారం పద్మశ్రీ అవార్డును అందుకున్న మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపకుడు మందకృష్ణను సీతారాంమాదిగ, ఆటో ప్రకాశ్‌లు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాబోయే ఎన్నికల్లో ఓటు అనే ఆయుధంతో రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి మాదిగలు తగిన బుద్ధి చెబుతారన్నారు. మాలలకు ఉద్యోగాలకు దోచిపెట్టిన రేవంత్‌రెడ్డి మాదిగలకు మంత్రి వర్గంలో స్థానం కల్పించకపోవడం మాదిగలపై ఆయనకు ఉన్న వివక్ష తేటతెల్లమైందన్నారు.

సత్కారం..

రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి సత్కరిస్తున్న రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్ (సికింద్రాబాద్-ఆంధ్రజ్యోతి)





ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను కలిసిన ముస్లింలు

ముస్లింలకు ఎమ్మెల్యే తలసాని శుభాకాంక్షలు

మారేడుపల్లి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పలువురు ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాలకు చెందిన పలువురు ముస్లింలు బుధవారం తలసానిని వెస్ట్ మారేడుపల్లిలోని ఆయన కార్యాలయంలో కలిసి శాలువాలతో సత్కరించి రంజాన్ ప్రత్యేక వంటకం షీర్‌కుర్మాను అందజేశారు. తలసాని వారికిరంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు శేఖర్ ముదిరాజ్, అక్బర్, నసీం భాను, విజయలక్ష్మి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు శ్రీహరి, ఆరీఫ్, సాబీర్ అలీ, నవాబ్ అశ్వాక్, అజీజ్, సనత్‌నగర్‌కు చెందిన నోమన్, సికిందర్, ఉస్మాన్, ఫహీం తదితరులు పాల్గొన్నారు.

రికార్డు స్థాయిలో 1681 లోకోమోటివ్‌ల తయారీ : రైల్వే బోర్డు

హైదరాబాద్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): భారతదేశం రికార్డు స్థాయిలో 1681 లోకోమోటివ్ (రైల్వే యంత్రాలు)లను ఉత్పత్తి చేసింది. యునైటెడ్ స్టేట్స్, యూరప్, సౌత్ అమెరికా, ఆఫ్రికా, ఆస్ట్రేలియా దేశాలను అధిగమించి 2024-25లో అత్యధికంగా లోకోమోటివ్‌లను తయారు చేసినట్టు రైల్వే బోర్డు అధికారులు తెలిపారు. 2023-24లో భారతదేశంలోని అన్ని లోకోమోటివ్ తయారీ యూనిట్‌ల నుంచి 1472 రైల్వే యంత్రాలు ఉత్పత్తి కాగా, గడిచిన ఆర్థిక సంవత్సరంలో 1681 యంత్రాలను తయారు చేయడం విశేషమన్నారు. 2004 నుంచి 2014 వరకు 4695 లోకోమోటివ్‌ల ఉత్పత్తితో జాతీయ వార్షిక సగటు 470గా నమోదైనట్టు అధికారులు పేర్కొన్నారు. ఇలా ఉండగా, మేక్ ఇన్ ఇండియా 'చొరవతో 2014నుంచి 2024 వరకు భారత దేశం 9,168 రైల్వే లోకోమోటివ్‌లను ఉత్పత్తి చేసి సగటున ఏడాదికి 917కు పెంచినట్టు రైల్వే అధికారులు తెలియజేశారు. చిత్తరంజన్ లోకోమోటివ్ వర్క్స్ 700, బనారస్ లోకోమోటివ్ వర్క్స్ 477 లను తయారు చేయగా పాటియాల లోకోమోటివ్ వర్క్స్ 304, మాధేపురా, మౌర్హారాల్లో వంద చొప్పున లోకోమోటివ్‌లను ఉత్పత్తి చేసినట్టు రైల్వే బోర్డు అధికారులు పేర్కొన్నారు. దేశంలో ఉత్పత్తి అయిన లోకోమోటివ్‌ల్లో అధిక శాతం సరకు రవాణా రైళ్ల కోసం వినియోగిస్తున్నట్టు తెలిపారు.

7 నుంచి మహా కుంభాభిషేకం

రెజిమెంటల్‌బజార్,ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ శివాజీనగర్‌లోని పెరుమాళ్ ఆలయం స్థాపించి 200 ఏళ్లు పూర్తవుతుండటంతో మహా కుంభాభిషేకం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఏప్రిల్ 7వ తేదీ నుంచి మహాకుంభాభిషేక పూజలు ప్రారంభం అవుతుండటంతో అన్ని శాఖల అధికారులు ఏర్పాట్ల పై నిమగ్నమయ్యారు. బుధవారం ఆలయ ఈఓ సత్యమూర్తి, కార్పొరేటర్ కొంతం దీపిక, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఉపశంకర్, ఏఈ చంద్రశేఖర్, ఫీల్డ్ ఆఫీసర్ హరి, వాటర్‌వర్క్స్ అధికారి మనోహర్, జవాన్ అనిల్ కుమార్‌లు ఏర్పాట్లపై సమీక్షించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా క్యూ లైన్లు, తాగునీరు, నీడ కోసం టెంట్లు, బారికేడ్లు తదితర వసతుల పై చర్చించారు.

ఇక 'ఎర్లీ బర్డ్'పై ఫోకస్

- 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఆస్తిపన్ను వసూళ్లలో జంట సర్కిళ్ల రికార్డు
- ఇప్పుడు 'ఎర్లీ బర్డ్' వసూళ్లపై డీసీల దృష్టి



జీహెచ్ఎంసీ సికింద్రాబాద్ జోన్ ఆఫీస్ ఆవరణలో ఎర్లీ బర్డ్ స్కీమ్ కింద ఆస్తిపన్ను చెల్లించడానికి బారులు తీరిన సీనియర్ సిటిజెన్స్

సికింద్రాబాద్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ఆర్థిక సంవత్సరం ముగిసింది.. గతేడాదితో పోలిస్తే ఈ సంవత్సరం అధిక మొత్తంలో ఆస్తిపన్ను వసూలు చేసిన జీహెచ్ఎంసీ జంట సర్కిళ్లు.. ప్రస్తుతం ఎర్లీ బర్డ్‌పై దృష్టి సారించాయి. మునుపెన్నడూ లేని రీతిలో అత్యధిక స్థాయిలో ఆస్తిపన్ను వసూలు చేయడం ద్వారా సికింద్రాబాద్, బేగంపేట జంటసర్కిళ్లు రికార్డు సృష్టించాయి. దీంతో జంట సర్కిళ్ల అధికారులు ఉన్నతాధికారుల ప్రశంసలు అందుకున్నారు.

●జీహెచ్ఎంసీ బేగంపేట సర్కిల్ 2023-24 ఆర్థిక సంవత్సరంలో 97 కోట్లు ఆస్తిపన్ను రూపంలో వసూలు చేయగా, గడచిన 2024-25 ఆర్థిక సంవత్సరంలో 99.12 కోట్లు వసూలు చేసి రికార్డు సృష్టించింది. సికింద్రాబాద్ సర్కిల్ విషయానికి వస్తే గడచిన 2024-25 ఆర్థిక సంవత్సరంలో 25.50 కోట్లు వసూలు చేయాలని లక్ష్యాన్ని నిర్దేశించగా, 28.41 కోట్లు వసూలు చేసి రికార్డు సృష్టించారు.

'విస్తృతంగా ప్రచారం చేయాలి'

నూతన ఆర్థిక సంవత్సరం ప్రారంభం కావడంతో జంట సర్కిళ్ల అధికారులు ఎర్లీ బర్డ్ స్కీమ్ కింద ఆస్తిపన్ను వసూళ్లపై దృష్టి సారించారు. సికింద్రాబాద్ సర్కిల్ ఉపకమిషనర్ సుభాష్‌రావు, బేగంపేట సర్కిల్ ఇన్‌చార్జి ఉపకమిషనర్ డాకూ నాయక్‌లు ట్యాక్స్ విభాగాల అధికారులు, ఉద్యోగులతో బుధవారం విడివిడిగా సమావేశమయ్యారు. ఎర్లీ బర్డ్ స్కీమ్ కింద ముందుగానే ఆస్తిపన్ను చెల్లిస్తే 5 శాతం రాయితీ ఇస్తున్న అంశాన్ని విస్తృతంగా ప్రచారం చేసి, అందరికీ అవగాహన కలిగించి, మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. కాగా బేగంపేట సర్కిల్ గడిచిన ఆర్థిక సంవత్సరంలో వసూలు చేసిన 99.12 కోట్లలో 49.25 కోట్లు ఎర్లీ బర్డ్ స్కీమ్ ద్వారా రావడం గమనార్హం. అందుకే ఈ ఏడాది కూడా ఎర్లీ బర్డ్ స్కీమ్ కింద ఈ నెలాఖరు వరకు 50 కోట్ల రూపాయిలకుపైగా ఆస్తిపన్ను వసూలు చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. ఇదిలా ఉండగా బుధవారం ఎర్లీబర్డ్ కింద ఆస్తిపన్ను చెల్లించడానికి సికింద్రాబాద్‌లోని జీహెచ్ఎంసీ జోనల్ కార్యాలయం ప్రాంగణంలో ఉన్న సిటిజెన్ చార్టర్‌కు పౌరులు బారులు తీరడం విశేషం.

రాజ్యాంగ విలువలను తెలిపేందుకే 'జైబాపు, జైభీమ్' యాత్ర

● ఎమ్మెల్యే శ్రీగణేశ్



యాత్రలో ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేశ్, కాల్వ సుజాత తదితరులు

బోయినపల్లి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ నినాదంతో ఏఐసీసీ పిలుపు మేరకు భారత రాజ్యాంగ వ్యతిరేక విధానాలకు నిరసనగా కో-ఆర్డినేటర్, ఆర్యవైశ్య చైర్ పర్సన్ కాల్వ సుజాత, కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున పాదయాత్ర చేపట్టారు. భారతదేశ స్వరూపాన్ని, రాజ్యాంగ స్ఫూర్తిని, రాజ్యాంగ విలువలను చాటి చెబుతూ బుధవారం కంటోన్మెంట్ నియోజకవర్గంలోని బోయినపల్లి బాపూజీనగర్ ముత్యాలమ్మ ఆలయం నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి పాదయాత్రను నిర్వహించారు. ముందుగా ముత్యాలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. బాపూజీనగర్‌లో మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం అక్కడ నుంచి ప్రారంభించిన పాదయాత్ర వీఆర్ ఆస్పత్రి, కంసారిబజార్, నేతాజీనగర్ మీదుగా అంబేడ్కర్ చౌరస్తా వరకు కొనసాగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీగణేశ్ మాట్లాడుతూ, రాజ్యాంగాన్ని నిర్వీరం చేసే బీజేపీ మాయలో పడకుండా దేశాన్ని, దేశప్రజలను కాపాడుకోవటానికి వాడవాడలా తిరుగుతూ ప్రజలకు రాజ్యాంగం పట్ల అవగాహన కల్పిస్తూ చేపట్టిందే జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ అభియాన్ పాదయాత్ర అన్నారు. నాలుగొందల సీట్లు వస్తే అంబేడ్కర్ రాసిన రాజ్యాంగాన్ని మారుస్తామని అనడటంతో పాటు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను పార్లమెంట్‌లో కేంద్రహోంమంత్రి అమిత్‌షా అవమానించారని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు జంపన ప్రతాప్, మర్రి అమరేందర్‌రెడ్డి, బోయినపల్లి మార్కెట్ యార్డ్ పాలకమండలి సభ్యుడు సాయిశరత్, బద్దం బల్వంత్‌రెడ్డి, ముప్పిడి మధుకర్, సదా, సరిత, శ్యాంసన్ రాజ్, కాంపల్లి శ్రీకాంత్, బద్రీనాథ్‌యాదవ్, సంతోష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామ నవమి వేడుకలకు ఏర్పాట్లు

- వీర హనుమాన్ ఆలయంలో 6న సీతారాముల కల్యాణం



వీర హనుమాన్ దేవాలయం

రాంగోపాల్‌పేట్. ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): సర్దార్ పటేల్ రోడ్డులోని వీర హనుమాన్ ఆలయంలో ఈ నెల 6వ తేదీన శ్రీరామ నవమి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాటు చేస్తున్నామని ఆలయ కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాస శర్మ తెలిపారు. బుధవారం ఆలయ ప్రాంగణంలో ఆయన విలేకరులకు శ్రీరామ నవమి, శ్రీసీతారామ కల్యాణ మహోత్సవానికి సంబంధించిన వివరాలను వెల్లడించారు. 6వ తేదీ ఉదయం 10.30 పునర్వసు నక్షత్రం, అభిజిత్ లగ్నంలో సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించేలా ఆలయ ప్రాంగణంలోని కల్యాణ మండపంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఎండాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని భక్తుల సౌకర్యార్థం ఆలయ ప్రాగణంలో చలువ పందిళ్లు, కూలర్లు, ఫ్యాన్లు, మంచి నీటి సౌకర్యాన్ని ఉదయం నుంచే అందుబాటులో ఉంచుతామన్నారు. కల్యాణోత్సవం జరిపించాలనుకునే భక్తులు దేవస్థాన కార్యాలయంలో ముందుగా సంప్రదించాలన్నారు.

మాదిగలకు రెండు మంత్రి పదవులు కేటాయించాలి

● ప్రొ. గాలి వినోద్ కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొ. గాలి వినోద్ కుమార్

తార్నాక, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టబోయే మంత్రివర్గ విస్తరణలో జనాభా దామాషా ప్రకారం మాదిగలకు రెండు మంత్రి పదవులను కేటాయించాలని దక్షిణ భారత జేఏసీ చైర్మన్ ప్రొ. గాలి వినోద్ కుమార్ అన్నారు. బుధవారం తార్నాకలోని దక్షిణ భారత జేఏసీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వినోద్ కుమార్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో సుమారు 42 లక్షల జనాభా కలిగిన మాదిగలకు కాంగ్రెస్ పార్టీ ఒక్క మంత్రి పదవి కూడా కేటాయించలేదని మండిపడ్డారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూడా మాదిగలకు ఒక్క స్థానం కూడా ఇవ్వలేదని, ఇప్పటికైనా కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం స్పందించి ఆరు గురు ఎమ్మెల్యేలు ఉన్న మాదిగలకు రెండు మంత్రి పదవులు ఇవ్వాల్సిందేనని, లేని పక్షంలో మాదిగ జాతి గుణపాఠం చెబుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వేల్పుల సంజయ్, దరువు రమేష్, నాగరాజు, సత్యం, అంబేద్కర్, రవితేజ పాల్గొన్నారు.



సర్దార్ పాపన్న గౌడ్ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న భరత్‌గౌడ్ తదితరులు

సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్‌కు నివాళి

బౌద్ధనగర్, ఏప్రిల్2(ఆంధ్రజ్యోతి): బహుజన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ వర్ధంతిని బుధవారం సీతాఫల్‌మండిలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిర్వహించారు. బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కోశాధికారి ఆకారం రమేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో బీజేపీ మహంకాళి సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షుడు భరత్‌గౌడ్, ప్రధానకార్యదర్శి మేకల సారంగపాణి పాల్గొని పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మొట్టమొదటి బహుజన నాయకుడు పాపన్నగౌడ్ అని, అతడి త్యాగాలను, సేవలను పలువురు ఈ సందర్భంగా కొనియాడారు. కార్యక్రమంలో కన్వీనర్ కందాడి నాగేశ్వరరెడ్డి, ఉపాధ్యక్షుడు రాచమల్ల కృష్ణమూర్తి, కనకట్ల హరి, నాయకులు ప్రభుగుప్తా, అంబాల రాజేశ్వరరావు, పోచయ్యయాదవ్, భాస్కరగిరి, సాయిప్రసాద్‌గౌడ్, సతీష్‌ముదిరాజ్, శారదామల్లేష్, భానుమతి డివిజన్ అధ్యక్షుడు నరేష్ పాల్గొన్నారు.

తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో బేబీ వియోనాకు చోటు



తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ సర్టిఫికెట్‌తో బేబీ వియోనా

తార్నాక, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా సదాశివపేటకు చెందిన బేబీ వియోనా 19 నెలల అతి చిన్న వయస్సులో తనకున్న అద్భుత మేధాశక్తితో తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించుకున్నారు. ఈ మేరకు బుధవారం లాలాపేటలోని తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డా.చింతపట్ల వెంకటాచారి మాట్లాడుతూ, బేబీ వియోనా 19 నెలల అతి చిన్న వయస్సులో తనకున్న అద్భుత మేధాశక్తితో సుమారు 50 దేశాల జాతీయ జెండాలను గుర్తించడమే కాకుండా 116 పజిల్స్‌ను పరిష్కరించినందుకు సూపర్ కిడ్స్ విభాగంలో బేబీ వియోనాకు తెలుగు బుక్ రికార్డ్స్‌లో స్థానం కల్పించామన్నారు.

వేర్వేరు ఘటనలో ఇద్దరు మహిళలు అదృశ్యం



పద్మ

బోయినపల్లి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): పనికి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి బయటకు వెళ్లిన మహిళ, రేషన్ కార్డులో మార్పులు చేయించేందుకు వెళ్లిన యువతి అదృశ్యమైన ఘటనలు బోయినపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగాయి. అంజయ్య నగర్‌కు చెందిన జి.పద్మ (42) కెమికల్ సంస్థలో పనిచేస్తోంది. గత నెల 28వ తేదీన విధులకు వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. భర్త ఫిర్యాదు మేరకు బోయినల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువతి మిస్సింగ్..



బెల్లంకొండ అరుణ

రేషన్ కార్డులో మార్పులు చేయించేందుకు తల్లిదండ్రులు మీ సేవ కేంద్రానికి వెళ్లిన సమయంలో వారి కుమార్తె అదృశ్యమైంది. ఎస్ఐ శివశంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. బెల్లంకొండ అరుణ నాగేశ్వరరావు దంపతులు బోయినపల్లి రాంరెడ్డి కాలనీలో ఉంటున్నారు. రేషన్ కార్డులో మార్పుల కోసం మంగళవారం తల్లిదండ్రులు మీసేవ కేంద్రానికి వెళ్లారు. వారు తిరిగి వచ్చేసరికి కుమార్తె ఇంట్లో లేదు. కుమార్తె కనిపించకపోవడంతో బంధు,మిత్రులను వాకబు చేసినా ఆచూకీ లేకపోవడంతో బుధవారం వరకు వేచి చూసి తల్లి లక్ష్మీదేవి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పెరిగిన భారతదేశ రక్షణ ఎగుమతులు

అల్వాల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): 2024-25 ఆర్థిక సంవత్సరంలో భారతదేశ రక్షణ ఎగుమతులు రూ.23,622 కోట్లు (సుమారు 2.76 బిలియన్లు) రికార్డు స్థాయికి చేరుకున్నాయి. గతేడాదితో పోలిస్తే 12.04 వృద్ధి రేటును సాధించింది. రక్షణ ప్రభుత్వ రంగ సంస్థలు(డీపీఎస్‌యూ)లు ఈ పెరుగుదలలో కీలక పాత్రను పోషించాయి. వాటి ఎగుమతులు 42.85 శాతం పెరిగి రూ. 8,389 కోట్లకు చేరుకున్నాయని రక్షణ మంత్రిత్వశాఖ బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో వెల్లడించింది.

గుర్తు తెలియని వృద్ధుడి మృతి



గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహం

అడ్డగుట్ట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందిన ఘటన సికింద్రాబాద్‌లో జరిగింది. గోపాలపురం పోలీసు స్టేషన్ ఎస్ఐ మాధవి తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ నార్త్‌జోన్ డీసీపీ కార్యాలయం ఎదురుగా 60 ఏళ్ల ఓ వృద్ధుడు చనిపోయి ఉన్నాడని గోపాలపురం పోలీసులకు బుధవారం సమాచారం అందింది. పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. మృతుడి వివరాలు ఇంకా తెలియరాలేదని ఎస్ఐ తెలిపారు. ఈ ఫొటోలో కనిపిస్తున్న మృతుడి బంధువులు ఎవరైనా ఉంటే నం. 8712660209కు ఫోన్ చేసి గోపాలపురం పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ కోరారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

ఎట్టకేలకు తీరనున్న దాహార్తి

- బోయినపల్లి మార్కెట్‌లో తాగునీటి సదుపాయం
- పైప్‌లైన్ వేసేందుకు కంటోన్మెంట్ బోర్డు అంగీకారం
- తీరనున్న రైతులు, వ్యాపారులు, కొనుగోలుదార్ల తాగునీటి కష్టాలు



బోయినపల్లి మార్కెట్ యార్డు

సికింద్రాబాద్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): రెండు దశాబ్దాల క్రితం ఆవిర్భవించిన బోయినపల్లి మార్కెట్ యార్డులో ఎట్టకేలకు తాగునీటి సదుపాయం కలగనుంది. దీంతో తెలుగు రాష్ట్రాలతో పాటు దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే రైతులు, వ్యాపారుల నీటి కష్టాలు ఇకపై తీరనున్నాయి.

అతి పెద్ద మార్కెట్..

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు కూతవేటు దూరంలో 1965లో మోండా మార్కెట్ ఏర్పడింది. క్రమంగా ఈ ప్రాంతంలో ట్రాఫిక్ పెరగడంతో పాటు కొనుగోలుదారులు, రైతులు, వ్యాపారుల సంఖ్య అధికం అవుతుండటంతో మోండా మార్కెట్‌పై ఒత్తిడి పెరిగింది. కూరగాయలు, బియ్యం, పప్పు దినుసులు తదితర సామగ్రి తీసుకువచ్చే లారీలతో పాటు వర్తక వ్యాపారాల కోసం వచ్చే రైతులు, ఏజంట్లు, కొనుగోలుదారుల వాహనాలతో నిత్యం ట్రాఫిక్ సమస్య ఏర్పడేది.

● ఈ నేపథ్యంలో బోయినపల్లికి మోండా మార్కెట్‌ను తరలించాలని అప్పట్లో ప్రభుత్వం నిర్ణయించింది. విశాలమైన స్థలంలో 144 దుకాణాలు ఏర్పాటు చేసింది. తొలుత యావత్ మార్కెట్‌ను సికింద్రాబాద్ నుంచి తరలించాలని అనుకున్నప్పటికీ, ప్రజల సౌకర్యార్థం 2002 లో పాక్షికంగా తరలించింది. హోల్‌సేల్ వర్తక, వ్యాపారులను తరలించారు.

● 23 సంవత్సరాల క్రితం ఆవిర్భవించిన బోయినపల్లి మార్కెట్‌లో ఇప్పటి వరకూ మంచినీటి సదుపాయమే లేదు. దీంతో ఈ మార్కెట్‌కు నిత్యం వచ్చే రైతులు, వ్యాపారులు, కొనుగోలుదార్లు తాగునీటికి ఇబ్బంది పడుతున్నారు. దుకాణాలు నడుపుకుంటున్న వ్యాపారులు తమకు, తమ సిబ్బంది కోసం మంచినీటిని కొనుగోలు చేసుకుంటున్నారు. అలాగే మార్కెట్‌కు వచ్చే రైతులు, కమిషన్ ఏజంట్లు, కొనుగోలుదార్ల సౌకర్యార్థం మార్కెట్ యార్డు అధికార యంత్రాంగం మంచినీటిని కొనుగోలు చేసి, సింటెక్ ట్యాంకుల ద్వారా అందుబాటులో ఉంచుతోంది.

● కొద్ది రోజుల క్రితం బోయినపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన రాగీరు ఆనంద్‌గౌడ్, ఇతర సభ్యులు మంచినీటి సమస్య శాశ్వత పరిష్కారంపై దృష్టి సారించారు.కంటోన్మెంట్ శాసనసభ్యుడు శ్రీగణేశ్‌ను కలిసి సమస్యను వివరించారు. కంటోన్మెంట్ బోర్డు యంత్రాంగంతో మాట్లాడి తమకు తాగునీటి కనెక్షన్లు ఇప్పించాలని కోరారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే.. కంటోన్మెంట్ ముఖ్య కార్యనిర్వహణాధికారి డి.మధుకర్‌నాయక్, వాటర్ సూపరింటెండెంట్ రాజ్‌కుమార్ తదితర అధికారులతో మాట్లాడి మార్కెట్‌లో తాగునీటి పైప్‌లైన్ వేసి తాగునీటి సదుపాయం కల్పించాలని కోరారు. సానుకూలంగా స్పందించిన అధికారులు ఇటీవల జరిగిన పాలక మండలి సమావేశం అజెండాలో ఈ అంశాన్ని చేర్చి, మార్కెట్ యార్డుకు తాగునీటి సదుపాయం కల్పించాలని తీర్మానించారు. కొద్ది రోజుల్లో మార్కెట్‌కు తాగునీళ్లు రానున్నాయని తెలిసి అటు రైతులు, కూలీలు, వ్యాపారులు, కొనుగోలుదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆదర్శ మార్కెట్‌గా తీర్చిదిద్దేందుకు కృషి



రాష్ట్ర ప్రభుత్వం అండదండలు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు తదితరుల సహకారంతో బోయినపల్లి మార్కెట్‌ను దేశంలోనే ఆదర్శవంతంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నా. వివిధ కారణాల వల్ల ఇప్పటి వరకు మార్కెట్‌లో తాగునీటి పైప్‌లైన్ వ్యవస్థ లేదు. దాంతో రైతులు, కూలీలు, వ్యాపారులు, కొనుగోలుదారులు తాగునీటి కోసం అవస్థలు పడుతున్నారు. ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని తాము ఎమ్మెల్యే శ్రీగణేశ్‌ను కలిసి కోరగా, ఆయన కంటోన్మెంట్ బోర్డు అధికారులతో మాట్లాడి తాగునీటి పైప్‌లైన్ వేయిస్తున్నారు.

- రాగిరు ఆనంద్‌గౌడ్, మార్కెట్ చైర్మన్